



కల్లూరు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

జాడలేని విత్తనాలు

- ఖరీఫ్ ప్రారంభమైనా చాలా ప్రాంతాల్లో అందని వైనం
- చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం
- అన్నదాతకు తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ విత్తుకు రైతన్నలు సిద్ధమయ్యారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో ముందుగానే సాగు మొదలుపెట్టారు. సాగుకు ప్రధాన అవసరమైన విత్తనాలను ప్రభుత్వం ఆలస్యంగా పంపిణీ ప్రారంభించింది. కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాయితీ విత్తన పంపిణీ ప్రారంభించారు. ఇంకా చాలా ప్రాంతాల్లో విత్తనాలు అందని పరిస్థితి నెలకొంది. విత్తనాలను సరిపడా సమకూర్చుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయితీ విత్తనాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు..



ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. గత కొన్ని రోజులుగా ముందస్తు వర్షాలు కురుస్తున్నాయి. కర్నూలు జిల్లాలో మేలో సాధారణ వర్షపాతం 40.1 మిల్లీమీటర్లు కాగా రికార్డు స్థాయిలో 106.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలో మేలో సాధారణ వర్షపాతం 36.9 మిల్లీమీటర్లు కాగా 100.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాల నేపథ్యంలో పొలాల్లో తేమ శాతం పెరిగింది. పశ్చిమ ప్రాంతంలో మే రెండో వారం నుంచే ముంగారు పత్తి సాగు ప్రారంభించారు. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాధారణ సాగు 10,58,360 ఎకరాలు కాగా అందులో పత్తి 5,86,022.5 ఎకరాలుగా ఉంది. నంద్యాల జిల్లాలో సాధారణ సాగు 5,16,120 ఎకరాలుగా ఉంది. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పంటల సాధారణ సాగు 14,10,202.5 ఎకరాలుగా అంచనా వేశారు. రైతులు ఎక్కువగా పత్తితోపాటు కంది, వేరుసెనగ, మొక్కజొన్న, ఉల్లి, ఎండుమిర్చి, వరి, ఆముదం తదితరాలు సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా చాలా ప్రాంతాల్లో నేటికీ రాయితీ విత్తన పంపిణీ ప్రారంభం కాలేదు. బుధవారం కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఎమ్మెల్యేలు నామమాత్రంగా ప్రారంభించారు. రాయితీ విత్తనాల కోసం డి.క్రిషి యాప్లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో విత్తనాల రాయితీని ప్రభుత్వం ఖరారు చేసింది. వేరుసెనగ విత్తనాలను 40 శాతం రాయితీపై, వరి 23, కంది, మినుములు, పెసలు 30, కొర్రలు 50, పచ్చిరొట్ట ఎరువులను 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు పేర్కొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల అవసరానికి తగినట్లుగా విత్తనాలు రాలేదు. మరోవైపు రాయితీ విత్తన పంపిణీ జాడ కాన రావడం లేదని అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మే నెలలోనే విత్తనాల పంపిణీ ప్రారంభం కాగా ఈసారి విత్తన పంపిణీలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని పలువురి నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

జిల్లాలో	విత్తన కేటాయింపు (క్వింటాళ్లలో..)
రకం	కేటాయింపు
వేరుశనగ	9,099
కంది	892.50
మినుము	25
పెసలు	10
కొర్రలు	70
జీలుగ	154
పిల్లిపెసర	11

ఎరువూ బరువే..!

ఎరువులు పుష్కలంగా ఉన్నాయని వ్యవసాయ యంత్రాంగం చెబుతున్నా ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజను 2,15,450 టన్నుల ఎరువులు అవసరం కాగా ప్రస్తుతం 62142 టన్నుల ఎరువులు ఉన్నాయి. నంద్యాల జిల్లాకు 2.50 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా 48 వేల టన్నులు ఉన్నాయి. ప్రైవేటు డీలర్లు ఎరువు బస్తాను రూ.50 వరకు అధిక ధరతో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది.

అవసరమైన విత్తనాలు పంపిణీ చేయాలి



ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని రకాల విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలి. నకిలీ విత్తనాలను కూడా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ సంవత్సరం రుతుపవనాలు ముందుగానే వచ్చాయి. దీనికి అనుగుణంగా రైతులందరూ విత్తనాలు వేయడం కోసం సాగుకు సిద్ధం అయ్యారు. ప్రభుత్వం ఆలోచించి రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయాలి. అందులో నాణ్యమైన విత్తనాలు సరిపడా పంపిణీ చేయాలి. విత్తనాలు, ఎరువులు రైతులకు సబ్సిడీతోని ఇవ్వాలి. ఎరువులను ఫర్టిలైజర్ షాప్ వారు ఎమ్మార్పీ రేట్లకే అమ్మేలా చూడాలి.

- జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

హామీల అమలులో 'కూటమి' విఫలం

-సూపర్ సిక్స్ అమలు చేయాలి
-వెన్నుపోటు నిరసనలో వైసిపి నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో ఏడాదిలోగానే కూటమి సర్కార్ పరిపాల పట్ల వ్యతిరేకత నెలకొందని వైసిపి కోఆర్డినేటర్ గంగుల ప్రభాకర్ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి.మోహన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు పేరుతో నిరసన కార్యక్రమాన్ని కలెక్టరేట ఎదుట నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వచ్చి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ గంగుల ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి.మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్, రాష్ట్ర నాయకులు అలీఖాన్, కెడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ విజయ మనోహరి లు పాల్గొన్నారు. గంగుల ప్రభాకర్ రెడ్డి , ఎస్‌వి మోహన్ రెడ్డి ,హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయిందన్నారు. ఇప్పటికే దాదాపుగా లక్షన్నర కోట్లకు పైగా అప్పులు చేసిందన్నారు. గతంలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు రూ. రెండు లక్షల కోట్లకు పైగా అప్పులు చేశామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలు ఇప్పటికే ఈ ప్రభుత్వం పట్ల విసుగు చెందుతున్నారన్నారు. ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రద్దుచేసి పేదలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఇప్పటివరకు ఒక్క పైసా నిధులను కూడా విడుదల చేయలేదన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నిటిని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు



నిరసన ప్రదర్శన చేపడుతున్న వైసిపి నాయకులు

ఉపాధి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

ప్రజాశక్తి-పత్తికొండ

కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం చెందిందని పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం దగ్గర వ్యకాస ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు పెండింగ్ బకాయిల కోసం ధర్నా నిర్వహించారు. వీరశేఖర్, సిఐటియు జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. మండలంలోని సుమారుగా రూ.6 కోట్లు పెండింగ్ బకాయిలు ఉన్నాయని అన్నారు. ఉపాధి కూలీలు పూట గడవని కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో మౌళిక వసతులు లేక ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తాగునీరు, ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కిట్లు అందించడంలో అధికారులు పూర్తిగా విప్లవం చెందారని మండిపడ్డారు. ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించి కనీస వేతనం రోజుకు రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యకాస నాయకులు, ఉపాధి కూలీలు ఎపిఒ వెంకటేశ్వర్లును కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు నాయకులు దస్తగిరి, గోపాల్, వ్యకాస మండల నాయకులు పి.నరసన్న, బురుజులు, తిరుపాలు, రషీద్, శివరాజ్, రామాంజనేయులు, అక్బర్, నాగభూషణం పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కూలీలు

ఆర్‌టిఇ ప్రవేశాలకు అడ్డంకులు...

- అంగీకరించని ప్రయివేట్ విద్యాసంస్థలు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- ప్రభుత్వం చెల్లించకుంటే మీరు కట్టాలి
- విద్యార్థుల తల్లిదండ్రులతో ఒప్పంద పత్రాలు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆదోళన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద 6 నుండి 14 సంవత్సరాల వరకు ఉచిత విద్య అందించాలని చట్టం చెబుతుంది. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు మాత్రం కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు మాత్రం ససేమిరా అంటున్నాయి. 25 శాతం అడ్మిషన్లు నిరుపేద విద్యార్థులకు అందించాలని చట్టంలో పేర్కొన్నప్పటికీ యాజమాన్యాలు మాత్రం అనేక అడ్డంకులు సృష్టిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ముందస్తుగానే ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించుకుంటూ ప్రవేశాల కల్పనకు ఆటంకాలు సృష్టిస్తున్నారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని 2009లో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొని వచ్చింది. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అయితే 100శాతం పేదలకు ఉచితంగానే విద్యను అందిస్తుండగా ప్రైవేటు విద్యాసంస్థల్లో అయితే 25 శాతం ప్రవేశాలను నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు అమలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లాలో ప్రవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలకు పొందేందుకు 3362 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2289 మంది విద్యార్థులు 25శాతం కోటా కింద ప్రవేశాలు పొందారు. ఈ చట్టం కింద ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల కు నేరుగా విద్యాశాఖ ఫీజులను చెల్లిస్తుంది. అర్బన్ ప్రాంతంలోని విద్యార్థులకు రూ.8 వేలు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు రూ.6000 చెల్లిస్తుంది. అడ్మిషన్లు ఇచ్చినటువంటి పాఠశాల యాజమాన్యాలకు నేరుగా ఈ ఫీజులను విద్యాశాఖ జమ చేస్తుంది. జిల్లాలో ప్రవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ చట్టం కింద ప్రవేశాలు పొందిన విద్యార్థులకు విద్యను అందించేందుకు ముందుకు రావడం లేదు. ప్రవేశ పత్రాలతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలకు వెళ్లి అడ్మిషన్లు ఇవ్వాలని కోరుతుంటే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముందుగానే అంగీకార పత్రంపై సంతకం చేయించుకుంటున్నారు. ప్రభుత్వం నుండి ఫీజులు చెల్లించకపోతే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఓ అంగీకారం పత్రంపై సంతకం చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అంగీకార పత్రంపై సంతకం చేసిన విద్యార్థులకు ప్రవేశాలకు తీసుకున్నందుకు యాజమాన్యాలు మొగ్గుచూపుతున్నాయి. ఉచిత నిర్బంధం పక్కాగా అమలు చేయాల్సిన పాఠశాల యాజమాన్యాలు ఇలాంటి అడ్డంకులు సృష్టించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఉచిత ప్రవేశాలకు పొందినప్పటికీ పాఠశాల యాజమాన్యాలు వ్యవహార శైలి పట్ల అసహనం వ్యక్తం చేస్తూ అడ్మిషన్ చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజులను విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేసి నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించేందుకు ముందుకు రాకపోవడం పట్ల విద్యార్థి పౌర సంఘాలు మండిపడుతున్నాయి. నిర్బంధ విద్య హక్కు చట్టాన్ని అమలు చేసేటువంటి పాఠశాలలకు మాత్రమే గుర్తింపు ఇచ్చే నిబంధనను ప్రభుత్వం తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

25 ప్రవేశాలు తప్పనిసరిగా కల్పించాలి

- ఎస్.శామ్యూల్ పాల్ జిల్లా విద్యాశాఖ అధికారి

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా 25శాతం ప్రవేశాలను కల్పించాలి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులందరికీ తప్పనిసరిగా అడ్మిషన్లు కల్పించాలి. అలా చేయని పక్షంలో సంబంధిత పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకునేందుకు వెనకాడేది లేదు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప డిమాండ్ చేశారు. డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ చట్టం కింద 25శాతం ప్రవేశాలను నిరుపేద విద్యార్థులకు తప్పనిసరిగా అందించాలన్నారు. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులందరికీ తప్పనిసరిగా ప్రవేశాలు కల్పించాలన్నారు. అనేక పాఠశాలలు విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు అటువంటి పాఠశాలలను గుర్తించి వాటి గుర్తింపు రద్దుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలి

-నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి
-శాంతి సమావేశం నిర్వహించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజలు కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్‌పి శాంతిసమావేశం నిర్వహించారు. ఈ నెల 7న బక్రీదు పండుగను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు నగరంలోని వివిధ వర్గాలకు చెందిన సామాజిక మత పెద్దలకు జిల్లా ఎస్‌పి సూచనలు చేశారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు కుల, మతాలనే బేధం లేకుండా భక్తి ప్రపత్తులతో అధ్యాత్మిక వాతవరణంలో పండుగలను జరుపుకోవాలన్నారు. అందరూ కలిసి మెలిసి సోదర భావంతో శాంతియుతంగా ఉండాలన్నారు. చట్టం ముందు అందరూ సమానులే, చట్టాలకు లోబడి ఉండాలన్నారు. చట్టాలను గౌరవించాలన్నారు. ఒకరినొకరు గౌరవించుకోవాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా సమాచారం ఇస్తే పోలీసుల పరంగా న్యాయం చేస్తామన్నారు. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. కర్నూలు జిల్లా మతసామరస్యానికి ప్రతీకగా కొనసాగుతుందన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే డయల్ 100కు, స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతను పటిష్టం చేస్తామన్నారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా మాట్లాడుతూ... సుహృద్భావ వాతావరణం కల్పించడం కోసం కృషి చేయాలన్నారు. సమయస్ఫూర్తితో ఉండాలన్నారు. వదంతులు నమ్మకూడదన్నారు. సమాజంలో అందరూ సమిష్టిగా ఉంటూ బక్రీదు పండుగ, త్వరలోవచ్చే వినాయకచవితి పండుగలను ప్రశాంతవాతావరణంలో జరుపుకుంటూ పోలీసులకు సహకరించాలన్నారు. కర్నూలు తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలోని బాలజీ నగర్ ,స్టాంటన్ పురం మధ్యలో ఒక పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని మత పెద్దలు ఎస్పీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, కర్నూలు ఇంచార్జ్ డిఎస్పీ శ్రీనివాసాచారి, మత పెద్దలు, ప్రభుత్వ ఖాజీ మౌలానా షేక్ అబ్దుల్ సలాం, మౌలానా సయ్యద్ జాకీర్ అహమ్మద్ రషాధి, సందడి చంద్రశేఖర్, గోరంట్ల రమణ, ఇంథియాజ్ ఖాన్, షానవాజ్, సిఐలు. తేజమూరి, కేశవరెడ్డి, రామయ్యానాయుడు, నాగరాజా రావు, తదితరులు పాల్గొన్నారు.



-శాంతి సమావేశానికి హాజరయిన మతపెద్దలు, ఎస్‌పి, నగర ముఖ్యులు

విజనరీకి స్వాగతం చెప్పిన సుదినం : టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



రాష్ట్రంలో విజనరీకి స్వాగతం పలికిన సుదినం జూన్4 అని టిడిపి నాయకులు పలువురు అన్నారు. జిల్లా టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు కెవి సుబ్బారెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు థరూర్ జేమ్స్, ముంతాజ్ బేగం, కొంకతి లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు క్రైప పద్మలత రెడ్డి, అబ్బాస్, నాయకులు హనుమంత రాయచౌదరి మాట్లాడారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్మోహన్‌రెడ్డే వెన్నుపోటు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విధ్వంసకారుడు జగన్మోహన్ రెడ్డికి సెలవు చెప్పి, విజనరీకి రాష్ట్ర ప్రజలు స్వాగతం పలికిన సుదినం జూన్-4 అని అన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందన్నారు. రాజధానిని నిర్వీర్యం చేశారన్నారు. పోలవరాన్ని గోదావరిలో ముంచారని ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను బెదిరించి రాష్ట్రం నుండి తరిమేశారన్నారు. విధ్వంసం నుండి వికాసం వైపు చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు నడపడాన్ని జీర్ణించుకోలేక జగన్మోహన్ రెడ్డి, వైసిపి విషం కక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా శవం ఉంటే, రౌడీషీటర్లు, సంఘవిద్రోహ శక్తులు జైలుకు వెళితే తప్ప ఏపీకి రానటువంటి జగన్ నేడు వెన్నుపోటు గురించి మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకు అన్యాయం జరిగితే ప్రజల కోసం ఉద్యమాలు, ప్రజాపోరాటాలు చేసేవారు ఇచ్చే పిలుపు కూడా ఒక స్థాయిలో ఉంటుందని, జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని, నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేసే విధంగా వెన్నుపోటు దినోత్సవంగా పిలుపునివ్వడం జగన్ రాక్షస, సైకో,

క్రీడలతో సెల్‌ఫోన్ వినియోగం దూరం

-తైక్వాండో క్రీడాకారులకు బ్యాగులు పంపిణీ
-గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



స్మార్ట్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాల నుంచి పిల్లలను దూరం చేయాలంటే క్రీడలు మంచి మార్గమని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో సీనియర్ తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆయన తన సొంత ఖర్చులతో బ్యాగులను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు స్మార్ట్‌ఫోన్లు అతిగా వినియోగిస్తున్నారని, దీనివల్ల దీర్ఘకాలిక వ్యాధులు అధికం అవుతున్నాయని చెప్పారు. వాటి నుండి విముక్తి కలిగించాలంటే పిల్లలను చిన్నతనం నుంచి క్రీడల్లో పాల్గొనేలా చేయాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల చిన్న పిల్లల్లో దురాలవాట్లు ప్రబలే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల ఊబకాయం, ఒంటరితనం అధికమవుతాయని, సామాజిక సంబంధాలు కూడా కోల్పోతారని చెప్పారు. ఇలాంటి అలవాట్ల నుంచి పిల్లలను దూరం చేయాలంటే క్రీడల్లో ప్రోత్సహించాలని, దీనివల్ల దేహదారుఢ్యం, ఏకాగ్రత పెరుగుతుందని, ధ్యానం, యోగ వంటి ఆరోగ్యానికి ఉపయోగపడే అంశాలు క్రీడల్లో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అధికంగా ఉన్న నేపథ్యంలో క్రీడాకారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకొని వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు.

పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి కర్నూలు కార్పోరేషన్

కర్నూలు నగరానికి చుట్టూ నదులున్నా వాటిలో మురుగు నీరు చేరడంతో స్వచ్ఛమైన నీరంతా కలిసిపోయి దుర్గంధ భరితంగా మారుతుంది. తుంగభద్రా నది ఒడ్డున ఉన్న పరిశ్రమల వల్ల కూడా జలకాలుష్యం ఏర్పడుతుంది. పర్యావరణం అనేది మానవునికి ముఖ్యమైన జీవనాధారం. పర్యావరణ మానవులకు అవసరమైన ముడి పదార్థాలను అందిస్తుంది.చెట్లను రక్షిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం. చెట్లను నాటి కాలుష్యాన్ని నిర్మూలిద్దాం. మానవ మనుగడకు ఉపయోగపడే పంచ భూతాలైనటువంటి భూమి నీరు గాలి ఆకాశం అగ్ని లాంటివి ముఖ్యంగా చెప్పుకోవచ్చు. వీటిని కలుషితం చేయకుండా ఉన్నంతవరకు మానవునికి ఎలాంటి ప్రమాదం ఉండదు.

గాలి కాలుష్యం: కర్నూలులో గాలి నాణ్యత సూచిక (ఎక్యుఐ) వివిధ సమయాల్లో మారుతూ ఉంటుంది. జూన్ 2 నాటికి, కర్నూలులో గా ఎక్యుఐ 50 నమోదైంది. పిఎం2.5, పిఎం10 స్థాయిలు సురక్షిత పరిమితుల్లో ఉన్నాయి. అయితే, కొన్ని సందర్భాల్లో ఇదిపూర్ లేదా అన్‌హెల్దీ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా సున్నితమైన వ్యక్తులకు (శ్వాసకోశ సమస్యలున్నవారు, వృద్ధులు, పిల్లలు జాగ్రత్త పాటించాలి.

ప్రధాన కాలుష్య కారకాలు: పార్టిక్యులేట్ మేటర్ (పిఎం2.5, పిఎం 10) ఇవి గాలిలో తేలియాడే సూక్ష్మ కణాలు, ఇవి ఊపిరితిత్తులు , రక్తప్రవాహంలోకి ప్రవేశించి ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. కర్నూలులో పిఎం 10 స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) సిఫార్సు చేసిన పరిమితి కంటే ఎక్కువగా ఉన్న సందర్భాలు ఉన్నాయి.

కార్బన్ మోనాక్సైడ్ (సిఒ) ఇది ప్రధానంగా వాహనాల నుండి , శిలాజ ఇంధనాలను మండించడం వల్ల విడుదలవుతుంది.సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్ఒ2), నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్ఒ2 పారిశ్రామిక కార్యకలాపాలు వాహనాల నుండి ఇవి కూడా విడుదలవుతాయి.

పారిశ్రామిక ఉద్గారాలు: రాయలసీమ ఆల్కలీస్ వంటి పరిశ్రమల నుండి విడుదలయ్యే ప్రమాదకరమైన వ్యర్థాలు గాలి నాణ్యతను ప్రభావితం చేస్తాయి.

వాహన కాలుష్యం: వాహనాల నుండి వెలువడే పొగ కాలుష్యానికి ఒక ప్రధాన కారణం.

నిర్మాణ పనులు: నిర్మాణ స్థలాల నుండి వెలువడే దుమ్ము , ఇతర కాలుష్య కారకాలు.

వ్యర్థాలను కాల్చడం: బహిరంగంగా వ్యర్థాలను కాల్చడం వల్ల పొగ , విషపూరిత వాయువులు వాతావరణంలోకి విడుదలవుతాయి.

ఆరోగ్య ప్రభావాలు: గాలి కాలుష్యం శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, దీర్ఘకాలిక ఆస్తమా, , ఇతర ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు దారితీస్తుంది. ఇది గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.



కెసి.కెనాల్ కాలుష్యం: కర్నూలులోని కెసి కెనాల్‌తాగునీరు, సాగునీటికి ముఖ్యమైన వనరు. ఇది తీవ్రమైన కాలుష్యం సమస్యను ఎదుర్కొంటుంది. కెనాల్‌లో వ్యర్థాలను పారవేయడం, కొన్ని హోటళ్ల నేరుగా మురుగునీటిని వ్యర్థాలను వదులుతున్నారు. కొన్ని పరిశ్రమల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు కూడా నీటి కాలుష్యానికి కారణమవుతున్నాయి.

నదులను పరిరక్షిద్దాం...

కర్నూలు డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కె. తిరుపాల్‌రెడ్డి

కర్నూలు నగరంలో ఇటుపక్క తుంగభద్ర మరోపక్క అందరి నదులు మధ్యలో కెసి కెనాల్ ప్రవహిస్తున్నాయి. పాలకుల, అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం మానవ మనుగడకు ముప్పు వాటిల్లే విధంగా నగరంలోని మురుగు కాలువల నీళ్లన్నీ నదుల్లో కెసి కెనాల్‌లో వదలడం వల్ల ఆ నీరు దుర్గంధ భరితమై దోమలకు నిలయంగా మారుతుంది. దీనితో మానవుడు రకరకాల జబ్బుల బారిన పడుతున్నాడు. అందుకే ప్రతి కిలోమీటర్ కు ఒక చెక్ డాం నిర్మించి అక్కడే నీటిని శుద్ధి చేసే విధంగా నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి ఆ నీటిని మొక్కలు పెంపకానికి ఉపయోగించాలి. మానవుడు తన విధిగా భావించి మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి. మన ఇళ్లలోఉన్న చెత్తను మున్సిపల్ అధికారులకు మాత్రమే ఇచ్చి చెత్తను ఎక్కడంటే అక్కడ పారవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బట్ట లేదా జూటు బ్యాగులను తీసుకొని వెళ్లాలని, ప్లాస్టిక్ నిషేధించి వినియోగించే ,అమ్మే వారిపై కేసులు నమోదు చేయాలి.

కాలుష్యం నుంచి కర్నూలును కాపాడుకుందాం



ఐక్యరాజ్యసమితి 1972 లో, జూన్ 5ను ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించి . 'ఒన్లీ వన్ ఎర్త్' అనే నినాదంతో ప్రారంభించి రాబోయే ప్రమాదంనుంచి ప్రపంచ దేశాలకు పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చింది. ప్లాస్టిక్ కాలుష్యం దశాబ్దాలుగా మానవ జీవితంలోని ప్రతి ప్రక్రియలో చొరబడి, మనం తాగే నీటిలో, తినే ఆహారంలో, మన శరీరాల్లోకి చొరబడుతున్నది. ప్రపంచ వ్యాప్తముగా నీటి వనరులు ప్లాస్టిక్ కాలుష్యానికి గురయి జల జీవరాశి మనుగడ ప్రమాదంలో పడింది. ఈ కారణంగా ఐక్యరాజ్యసమితి 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం' అనే ప్రధాన నినాదంతో కార్యాచరణ మొదలుపెట్టింది. కర్నూలు నగరంలో హంద్రీ, తుంగభద్రా , కెసి కాలువ, వక్కెరవాగు, సుద్దవాగు, సీమ వాగులను పరిశీలించినట్లయితే మానవుల స్వార్థం వాటిని ఎలా విధ్వంసం చేసి, దురాక్రమణలకు పాల్పడి, వ్యర్థాలతో, మురుగు నీటితో కాలుష్యం చేసి విషతుల్యంగా మార్చినది ప్రత్యక్షంగా చూడగలం. భూగర్భ జలాల నీటి నాణ్యత కూడా దారుణంగా పడిపోవడం దీనికితోడు వాయుకాలుష్యం కారణంగా అంటువ్యాధులు ప్రబలడం నగరంలో పర్యావరణ క్షీణతను సూచిస్తున్నాయి. అటవీ ప్రాంతాలను రక్షించడం , చెట్లను నాటడం, పార్కులు , సామజిక వనాలను అభివృద్ధి చేయడం ద్వారా కర్నూలు ప్రాంతంలో ప్రతికూల వాతావరణం ఏర్పడకుండా కృషి చేయాలి. నీటివనరుల వ్యవస్థలు దురాక్రమణలకు గురవడం మూలంగానే హైదరాబాద్, ముంబై , బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం, విజయవాడ , కర్నూలు తదితర ప్రధాన నగరాలలో చిన్నపాటి వర్షాలకే నగరాలు వరదలు చవి చూడాల్సి వస్తుంది.

-ప్రొఫెసర్ మన్సూర్ రహ్మాన్, ఆర్థిక వేత్త, మానవశక్తి పరిశోధన కేంద్రం, కర్నూలు

సర్వే పనులకు సహకరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - గోనెగండ్ల



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

సర్వే పనులకు గ్రామస్తులు సహకరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కోరారు. బుధవారం మండలంలోని గంజిహళ్లి గ్రామంలో నిర్వహించిన రీసర్వేపై తహశీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయి మాట్లాడారు. గత రెండేళ్ల క్రితం గంజిహళ్లి గ్రామంలో రీసర్వే కోసం గ్రామసభ నిర్వహించినట్లు, అప్పుడు సమయాభావం వల్ల రీసర్వే పూర్తి కాలేదని తెలిపారు. అలాగే రీ సర్వేపై కొన్ని సమస్యలతో పాటు గ్రామం నుంచి అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఎలాంటి సమస్యలూ లేకుండా రీ సర్వేను పూర్తి చేయడానికి ప్రస్తుతం గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలూ లేకుండా ఈసారి రీసర్వేను పూర్తి చేస్తామన్నారు. భూముల విషయంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. డిటి శిరీష, ఆర్ఐ జనార్దన్ రావు పాల్గొన్నారు.

నత్తనడకన 'వంతెన' పనులు

- పరిశీలించిన వీరభద్రగౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి



తెగిన వంతెనను పరిశీలిస్తున్న వీరభద్ర గౌడ్

మండలంలోని చింత కుంట గ్రామంలో జాతీయ రహదారి 167పై ఉన్న వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆ వంతెన పక్కన తాత్కాలిక వంతెన నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ వంతెన తెగిపోయింది. ఈ వంతెనను టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ బుధవారం పరిశీలించారు. వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులపై మండిపడ్డారు. అనంతరం సిరుగాపురం గ్రామంలో టిడిపి కార్యకర్త రిసెప్షన్‌కు హాజరయ్యారు. దర్గా వలి, కమలాకర్ పాల్గొన్నారు.

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- మూడు రోజుల నుంచి వల్లూరు సచివాలయం మూత

- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం



కౌతాళం మండలం వల్లూరు గ్రామంలో సచివాలయం మూడు రోజుల నుంచి మూతపడిందని, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు కె.మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. బియ్యం కార్డులో పిల్లలను చేర్పించుకోవడానికి ప్రజలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా సమాధానం చెప్పే వారెవరూ లేరని తెలిపారు. ఈ సచివాలయ సిబ్బంది ఎవరి ఆజమాయిషీ కింద పని చేస్తున్నారని, ఇప్పటికీ ఎవరికీ తెలియకపోవడంతో ప్రజలు తికమకపడుతూ చాలా అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రజలు ఎవరు, ఏదైనా అడిగితే 'మాకు మీటింగ్ ఉంది. మేము అక్కడికి పోయినాం. ఇక్కడికి పోయినాం' అని సమాధానం చెబుతూ సిబ్బంది విధులకు దుమ్మా కొడుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఏ సచివాలయం సిబ్బంది కూడా సిద్ధంగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వల్లూరుకు సచివాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైసిపిది 'గొడ్డలి పోటు దినం' : టిడిపి

ప్రజాశక్తి - గోనెగండ్ల

అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే ఇచ్చిన హామీ మేరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటే.. ఓర్వలేని వైసిపి 'వెన్నుపోటు దినం' అంటూ టిడిపిపై విషం చిమ్ముతోందని, వైసిపిది గొడ్డలిపోటు దినమని టిడిపి నాయకులు మండిపడ్డారు. బుధవారం గోనెగండ్లలో టిడిపి ఆధ్వర్యంలో వైసిపికి బాబాయిని చంపిన గొడ్డలిపోటు దినమంటూ నిరసన చేపట్టారు. తెలుగు యువత మండల నాయకులు రంగస్వామి నాయుడు, నాగరాజు, సందీప్ నాయుడు, వినోద్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు బేతాళ బడేసా, రామాంజనేయులు, సత్యం స్వామి, సాయినాథ్, టిడిపి నాయకులు నూర్ అహ్మద్, కొట్టింటి ఫక్రుద్దీన్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

హామీల అమలుకు పోరాటం

- అక్రమ కేసులు పెడితే నిలదీద్దాం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

- వైసిపి ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే వరకు పోరాడదామని, నియోజకవర్గంలో ఎక్కడ అక్రమ కేసులు పెట్టినా అక్కడే నిలదీద్దామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం 'వెన్నుపోటు దినం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి పాలనలో నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందని తెలిపారు. నేటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక పోతున్నారని మండిపడ్డారు. రాయలసీమకు హామీలే మిగిలాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడమే కాకుండా వాలంటీర్ల తొలగింపు, ఆరోగ్యశ్రీ పథకం నిర్వీర్యం, విచారణ పేరుతో పింఛన్ల తొలగింపు చర్యలు చేపట్టారని విమర్శించారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు పథకాలను అమలు చేయకపోవడమే కాకుండా ప్రజల నెత్తిన భారం పడేలా పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రోటోకాల్ విషయంలో పోలీసులు ఇన్‌ఛార్జీలకు కాన్వాయ్ తీసుకెళ్తున్నారని, ఎమ్మెల్యేగా తనకు ఇవ్వాల్సిన ప్రోటోకాల్ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు అబోడే హోటల్ నుంచి ర్యాలీ నిర్వహించి, రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాల అధ్యక్షులు భీమారెడ్డి, ప్రహ్లాద రావు, రామ్మోహన్ రెడ్డి, బెట్టన గౌడ్, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు. **ఆలూరులో** ఎమ్మెల్యే బి.విరూపాక్షి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి వైఎస్.రాజశేఖర్ రెడ్డి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహశీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని అధికారంలోకి వచ్చి ఏడాదయినా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వంపై కేసులు నమోదు చేయాలని కోరారు. మరోవైపు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంతో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. వైసిపి నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** మాజీ ఎంపి బుట్టా రేణుక నేతృత్వంలో వైసిపి కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ విభాగ అధ్యక్షులు వై.రుద్ర గౌడ్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠతో పాటు వేలాదిమంది పార్టీ శ్రేణులు పాల్గొని నినాదాలతో కూటమి ప్రభుత్వ తీరును ఖండించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రతి వర్గాన్ని నిరాశపరిచిందని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన, మహిళలకు ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, నిరుద్యోగులకు భృతి వంటి పథకాలన్నీ హామీలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. వైసిపి నాయకులపైనా, కార్యకర్తలపైనా, సామాజిక ఉద్యమకారులపైనా, జర్నలిస్టులపైనా అక్రమ కేసులు పెట్టి, అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ తీరును చూపిస్తోందని తెలిపారు. ఈ మోసపూరిత ప్రభుత్వ తీరుపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు 'వెన్నుపోటు దినం' చేపట్టినట్లు చెప్పారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశ్వర్, బసిరెడ్డి, కె.సునీల్ కుమార్, నజీర్ అహ్మద్, మన్సూర్, చాంద్ బాష పాల్గొన్నారు. **ఆదోనిలో** ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ సమక్షంలో 'వెన్నుపోటు దినం' ర్యాలీ చేపట్టారు. ఎన్‌టిఆర్ విగ్రహం భీమాస్ కూడలి మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడారు. కూతురునిచ్చి వివాహం చేసిన సొంత మామనే వెన్నుపోటు పొడిచి అధికారం దక్కించుకున్న చంద్రబాబు ఇచ్చిన మాట తప్పడంలో మంచి నేర్పరి అని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా హామీలను నెరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు దక్కిందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐలు శ్రీరామ్, రాజశేఖర్ రెడ్డి, రామలింగప్ప, గంటా సుబ్బారావు బందోబస్తు నిర్వహించారు. నాయకులు చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, అశోక్, బాలాజీ, వసీం, నాయకులు దేవా, జిలేక, గురునాథరెడ్డి, దుర్గప్ప, ప్రహ్లాద, రవి రెడ్డి, నాగేంద్ర, రెహమాన్, ఫయాజ్, రఘునాథ్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, పరిగల నారాయణ, తాయన్న, ఫ్రాన్సిస్, బొబ్బిలి, సంజీవ్, వెంకటేశ్వర రెడ్డి ఉన్నారు.



మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఆలూరులో...



ఆదోనిలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు



ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న అధికారులు

సస్య రక్షణపై అవగాహన అవసరం

- భారత్ మిల్లెట్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సంగప్ప

ప్రజాశక్తి - మంత్రాలయం

పంటల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన ఉండాలని భారత్ మిల్లెట్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ బి.సంగప్ప సూచించారు. బుధవారం మండలంలోని వి.తిమ్మాపురం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలైన కొర్ర, సజ్జ యాజమాన్య పద్ధతులు కొర్ర, సజ్జతో విలువ ఆధారిత పదార్థాల గురించి వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే దిగుబడులు సాధించడానికి, అధిక ఆదాయాన్ని సాధించడానికి ఎడిఎ వెంకటేశ్వర్లు రైతులతో పాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు బృందంగా ఏర్పడి రైతులకు సూచనలు చేస్తున్నామని తెలిపారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ వై.మౌనిక, మిరప, ఉల్లి, పత్తి పంటలపై, అగ్రికల్చర్ ఆఫీసర్ గణేష్ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటల గురించి వివరించారు. రైతులకు కంది, శనగ, పత్తి, సాయిల్ శాంపిల్ కలెక్షన్ లిటరేచర్స్ ఇచ్చినట్లు చెప్పారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ

ప్రజాశక్తి - హోళగుంద

దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ సాధ్యమని హోళగుంద పిహెచ్‌సి వైద్యాధికారిణి బిందు మాధవి తెలిపారు. బుధవారం వైద్య కేంద్రం నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బుధవారం నుంచి 30 వరకు మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలరోజుల పాటు దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. సిహెచ్‌ఓ చంద్ర శేఖర్, వైద్య సిబ్బంది మంగమ్మ, ఆశాలు పాల్గొన్నారు.




హోళగుందలో ర్యాలీ గా వెళ్తున్న వైద్య సిబ్బంది

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కోటకొండ గ్రామంలో ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం వైద్యాధికారి వెంకటేశ్వర్లు, టిబి సూపర్‌వైజర్ వీరన్న ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్న వారు, గళ్లలో తెమడ, రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు వంటి లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నెలల వరకు ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. ఆశావర్కర్ల ద్వారా డాట్ పద్ధతిలో ప్రతినెలా మందులు వారి ఇంటికి పంపిణీ చేస్తారని చెప్పారు. టిబి మందులు వాడుతున్న వారికి ప్రతినెలా నిక్షయ పోషణ యోజన కార్యక్రమం కింద ప్రభుత్వం రోగి అకౌంట్‌కు ప్రతినెలా రూ.1000లు 6 నెలల వరకు వేస్తుందని తెలిపారు. హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రంగస్వామి, సర్పంచి భర్త లింగన్న, ఆరోగ్య పర్యవేక్షకులు మద్దిలేటి, ఎంఎల్‌హెచ్‌పి మల్లేష్, 104 సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేశ్వర్లు

టిడిపి పాలనపై విమర్శ తగదు


- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజారంజక పాలన అందిస్తున్న టిడిపిపై విమర్శలు చేయడం తగదని, కూటమి ప్రభుత్వం గెలిచిన జూన్ 4ని వెన్నుపోటు దినంగా వైసిపి పిలుపునివ్వడం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అసలు వెన్నుపోటుకు, గొడ్డలివేటుకు పేటెంట్ జగన్ రెడ్డిదేనని విమర్శించారు. స్కామ్‌ల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే జగన్ ముఠా ధర్నాల డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. తొలి ఏడాదిలో 10 శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వం.. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేసిన కూటమిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లలో 85 శాతం హామీలకు వైసిపి ఎగనామం పెట్టడం నిజం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని అడ్డుపెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసిపిని స్థాపించారని తెలిపారు. ఎత్తుకొని పెంచిన బాబాయ్‌ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకులను కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచారని చెప్పారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచిన ఘతన జగన్‌కే దక్కిందన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, టౌన్ బ్యాంకు ఛైర్మన్ ఉరుకుందయ్య శెట్టి, రామకృష్ణ, రంగస్వామి గౌడ్, సుందర్ రాజు పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని మాధవరం గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం చేసిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే జగన్ ముఠా ప్రయత్నిస్తోందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు చేసిందని చెప్పారు. **ఆలూరులో** టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.వీరభద్రగౌడ్ మాట్లాడారు. 2019-24 మధ్యలో జగన్ రెడ్డి చేసిన ఆర్థిక విధ్వంసం గురించి ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పుడు వైసిపి నాయకులు ఆర్థిక పరిస్థితులపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.



ఆలూరులో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్



రాఘవేంద్రరెడ్డి

రూ.45 లక్షలతో సిసి రోడ్లు ప్రారంభం

- టిడిపితోనే పట్టణాభివృద్ధి - ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. బుధవారం పట్టణంలోని వెంకటాపురం కాలనీ 28వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించిన నూతన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఎంఎస్ నగర్ 30వ వార్డు (5/406 నుంచి 5/502 వరకు) రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును, అలాగే ఎంఎస్ నగర్ 31వ వార్డులో సందు గుడి దగ్గర రూ.10 లక్షలతో పూర్తి చేసిన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం 22వ వార్డు గాంధీ నగర్‌లో రాజేశ్వరి హోటల్ పక్కన రూ.15 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనుల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టిడిపి నాయకులు చంద్రశేఖర్, కొండయ్య చౌదరి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా వాధీంద్ర తీర్థుల ఆరాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీవాధీంద్ర తీర్థుల ఆరాధనను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఆయన బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని, వాధీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు. వాధీంద్ర తీర్థుల చిత్రపటాన్ని స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చి, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోష్యి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్‌ఓ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు

కూటమి ప్రభుత్వం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి కోరారు. బుధవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో ఇంటింటికీ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ స్టిక్కర్లు అతికించారు. హెచ్.నాగరాజు, వీరేష్, కె.నాగరాజు పాల్గొన్నారు.



స్టిక్కర్లను అతికిస్తున్న నాయకులు, ప్రజలు

చెక్ పోస్టులు బలోపేతం

- తగ్గిన మద్యం రవాణా - ఎక్సైజ్ సిఐ సైదులు

ప్రజాశక్తి - ఆదోని



మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సిఐ సైదులు

కర్ణాటక మద్యం రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టులను బలోపేతం చేశామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదులు తెలిపారు. బుధవారం కర్ణాటక మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఆదోని స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని బాపురం, పెద్ద హరివాణం వద్ద ఉన్న చెక్‌పోస్టుల్లో తమ సిబ్బంది తనిఖీల ప్రక్రియ కొనసాగిస్తున్నారని తెలిపారు. నాటు సారా, కల్తీ మద్యం రవాణా తగ్గుముఖం పట్టిందన్నారు. కొందరిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపామని తెలిపారు. నాటుసారా తయారీ కేంద్రాలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ధ్వంసం చేస్తున్నామని చెప్పారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అనిల్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నిల్వ ఉన్న మూడు బాక్సుల కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం రవాణా చేసిన సురేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. నవోదయం 2.0లో భాగంగా ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిత్యం దాడులు నిర్వహిస్తూ స్లమ్ ఏరియాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

మనుషులంతా ఒకటే

- డీఎస్పీ ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మనుషులంతా ఒకటేనని, అన్ని మతాల బోధన సారాంశం సాటి మనిషి ఉన్నతే అని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని పట్టణ పోలీసు స్టేషన్‌లో పట్టణ సిఐ శ్రీనివాసులు అధ్యక్షతన బక్రీదు సందర్భంగా పట్టణంలోని వివిధ పార్టీలు, వివిధ మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉపేంద్ర బాబు, పట్టణ సిఐ శ్రీనివాసులు మాట్లాడారు. పండగ అనేది బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకునేదని, పండగ సమయంలో ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ఎమ్మిగనూరు పట్టణం ప్రశాంత వాతావరణానికి ప్రతీక అని తెలిపారు. తహశీల్దార్ శేషఫణి, పట్టణ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, టిడిపి నాయకులు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, టౌన్ బ్యాంకు డైరెక్టర్ గ్రంధి గిరి, వైసిపి నాయకులు ఖాసీం బేగ్, సిపిఎం నాయకులు రాముడు, సిపిఐ నాయకులు రంగన్న, ఎస్‌డిపిఐ నాయకులు యూసుఫ్, మౌలానా, బిజెపి నాయకులు నరసింహులు, సత్యనారాయణ రెడ్డి, కౌన్సిలర్ దయాసాగర్, ఎపిడబ్ల్యుఎఫ్ నాయకులు షబ్బీర్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** పోలీసు స్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామాల మతపెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు, గోనెగండ్ల సిఐ విజయ భాస్కర్ మాట్లాడారు. శనివారం బక్రీద్ పండగను ఎలాంటి ఇబ్బందులూ లేకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని తెలిపారు. సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, అలా కాకుండా చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. **కౌతాళంలో** బక్రీద్ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని సిఐ అశోక్ కుమార్ కోరారు. పోలీసు స్టేషన్ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సర్పంచి పాల్ దినకరన్, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు మారుతి మోహన్, ఆవాజ్ కమిటీ మండల గౌరవాధ్యక్షులు ఖాజా హుస్సేన్ మాట్లాడారు. హిందువులు, ముస్లింలు సోదర భావంతో అన్ని పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతి పండగకూ అన్ని వర్గాలకు పంచాయతీ నుంచి సహాయ, సహకారాలు అందిస్తామని సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆనంద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు వీరభద్ర శెట్టి, వివిధ మసీదు కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో మాట్లాడుతున్న డీఎస్పీ



కౌతాళంలో మాట్లాడుతున్న సిఐ

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి కోర్టు

(సీనియర్ డివిజన్) : ఆదోని

I.P. No.02/2025

Between:

కె. నాగరాజు శెట్టి, S/o లేట్ కె.ఆదినారాయణ శెట్టి, వ్యాపారం, నివాసం ఇంటి నెం. 9/6, మసీదుపురం గ్రామం, కందనాతి పోస్ట్, ఎమ్మిగనూరు మండలం, కర్నూలు జిల్లా.

...పిటీషనర్

V/s.

1. పూజారి క్రిష్ణ మూర్తి S/o భీరప్ప, వయస్సు 30 సం॥లు,
2. కోతి శివణ్ణ S/o కోతి కేశన్న, వయస్సు 51 సం॥లు,
3. మేకని రాముడు S/o మేకని నరసింహులు, వయస్సు 50 సం॥లు,
4. అరవ మల్లేష్ S/o అరవ తిప్పన్న, వయస్సు 32 సం॥లు,
5. కురువ నరసింహులు S/o చౌకలమ్మగారి పీటయ్య, వయస్సు 30 సం॥లు,
6. కమ్మ కమలాక్షి S/o కమ్మ లక్ష్మన్న, వయస్సు 45 సం॥లు,
7. వింతాయణ వీరేష్, S/o వింతాయగా, వయస్సు 35 సం॥లు,
8. కమ్మాలదిన్నె చిన్న రంగస్వామి S/o నడిపన్న, వయస్సు 30 సం॥లు,
9. కైరుప్పల నాగేంద్ర S/o కైరుప్పల ఉసేని, వయస్సు 45 సం॥లు,
10. కమ్మ రాజేంద్ర S/o కమ్మ నారాయణ, వయస్సు 52 సం॥లు,
11. అరవ నరసింహులు S/o అరవ తిప్పయ్య, వయస్సు 35 సం॥లు,
12. పట్టా అంజినేయ S/o పజ్జా నరసన్న, వయస్సు 40 సం॥లు,
13. గంగలపాడు లక్ష్మన్న S/o జి. నెయ్యప్ప, వయస్సు 48 సం॥లు,
14. అరవ పరమేష్, S/o అరవ గుండప్ప, వయస్సు 50 సం॥లు,
15. కమ్మ క్రిష్ణయ్య S/o కమ్మ చిన్నరాయుడు, వయస్సు 40 సం॥లు,
16. మిషన్ ఈరన్న రమేష్ S/o మిషన్ మునెప్ప, వయస్సు 32 సం॥లు,
17. మేకల వీరేష్ S/oమేకల పెద్దన్న, వయస్సు 35 సం॥లు,
18. బోయ తుంగ సుధాకర్ S/o తుంగ పెద్దయ్య, వయస్సు 32 సం॥లు,
19. పెండ్లికల్ కామాక్షమ్మ W/o పెండ్లికల్ అంజీనయ్య, వయస్సు 45 సం॥లు,
20. కోసిగి సూరి S/O కోసిగి నల్లయ్య, వయస్సు 32 సం॥లు,
21. నలగడిద్ది వెంకటరాముడు S/o నలగడిద్ది బోదన్న, వయస్సు 50 సం॥లు,
22. అరవ పరమేష్, S/o అరవ బసప్ప, వయస్సు 50 సం॥లు,
23. ముల్లా చాంద్ బాష, S/o ముల్లా, వయస్సు 28 సం॥లు,
24. కురువ రాఘవేంద్ర S/o అంజనేయ, వయస్సు 35 సం॥లు,
25. కనకప్ప W/o పార్వతమ్మ వయస్సు 35 సం॥లు,
26. గుంట రాముడు S/o గుంట అంజనేయ, వయస్సు 35 సం॥లు,
27. గిరిని వెంకటేష్ S/o గిరిని శ్రీనివాసులు, వయస్సు 35 సం॥లు
28. పింజారి మౌలాలి S/o పింజారి కాసీమ్, వయస్సు 28 సం॥లు,
29. జోకురప్పగారి దేవేంద్ర S/o జోకురప్పగారి దాసప్ప, వయస్సు 50 సం॥లు,
30. కైరుప్పల భీముడు, S/o కైరుప్పల ఉసేని, వయస్సు 40 సం॥లు,
31. పుండుకూరు పెద్దమ్మ, W/o తెలియదు, వయస్సు 50 సం॥లు,
32. జీవన్ రాజ్ S/o పేటయ్య, వయస్సు 38 సం॥లు,
33. కటికె దస్తగిరి S/o కటికె వలి, వయస్సు 30 సం॥లు,
34. కడికె సర్వోజి, S/o తెలియదు, వయస్సు 50 సం॥లు,
35. ఒలిగి శాంతప్ప S/o ఒలిగి, వయస్సు 40 సం॥లు,
36. కౌలుట్లమ్మ W/o కర్రన్న, వయస్సు 50 సం॥లు,
37. అచ్చిలి రాముడు S/o అచ్చిలి నాగరాజు, వయస్సు 28 సం॥లు,
38. కురువ వణికేరప్ప S/o కురువ నరసన్న, వయస్సు 30 సం॥లు,
39. సక్రప్పగారి నరసింహులు, S/o తెలియదు, వయస్సు 30 సం॥లు,
40. సక్రప్పగారి భాస్కర్, S/O తెలియదు, వయస్సు 28 సం॥లు,
41. అరవ రమేష్ S/o అరవ పరమేష్, వయస్సు 30 సం॥లు,
42. చిన్న నాగమ్మగారి శ్రీరాముడు, S/o తెలియదు, వయస్సు 45 సం॥లు,
43. బోయ రంగస్వామి, S/o తెలియదు, వయస్సు 35 సం॥లు,
44. గుంట శివమ్మ S/o గుంట అంజినేయ, వయస్సు 30 సం॥లు,
45. ఎంగోడి బజారి S/o ఎంగోడి మద్దిలేటి, వయస్సు 32 సం॥లు,
46. తెలుగు నరసింహుడు S/o తెలుగు మక్క పేటయ్య, వయస్సు 35 సం॥లు,
47. కటికె ఉసేని, S/o తెలియదు, వయస్సు 53 సం॥లు,
48. కొత్తి శంకర్ S/o కొత్తి కేశన్న, వయస్సు 44 సం॥లు,
49. కొత్తి ఉరుకుంద S/o కొత్తి కేశన్న, వయస్సు 35 సం॥లు,
50. కురువ నరసింహులు S/o కురువ శారప్ప, వయస్సు 28 సం॥లు,
51. శరణప్పగారి చిన్న నరసింహులు, S/o తెలియదు, వయస్సు 30 సం॥లు,
52. పప్పుగుత్తి నరసింహులు, S/o పప్పుగుత్తి రామన్న, వయస్సు 45 సం॥లు,
53. ఒలిగి రామలక్ష్మీ D/o ఒలిగి ఈరన్న, వయస్సు 45 సం॥లు,
54. కమ్మాలదిన్నె నరసింహులు S/o పెద్రయ్య, వయస్సు 50 సం॥లు,
55. నలగడిద్ది చిన్న అంజినేయ S/o నలగడిద్ది బోడెన్న, వయస్సు 45 సం॥లు,
56. కురువ నరసింహులు S/o కురువ మునెప్ప, వయస్సు 45 సం॥లు,
57. అరవ తిప్పణ్ణ S/o అరవ పెద్ద నాగన్న, వయస్సు 52 సం॥లు,
58. ఉన్నం ఈరన్న, S/o తెలియదు, వయస్సు 51 సం॥లు,
59. పూజారి వొన్నప్ప S/o పూజారి చిన్న బీరప్ప, వయస్సు 42 సం॥లు,
60. డబ్బి మల్లేష్ S/o డబ్బి తిక్కయ్య, వయస్సు 33 సం॥లు, నెం.1 నుండి 60 వరకు కనపరచినవారందరి నివాసము మసీదుపురం గ్రామం, కందనాతి పోస్ట్, ఎమ్మిగనూర్ మండలం, కర్నూలు జిల్లా.
61. శ్రీనివాసులు శెట్టి S/o సంజీవయ్య శెట్టి, వయస్సు 45 సం॥లు, నివాసం పెద్దహరివాణం గ్రామం, ఆదోని మండలం, కర్నూలు జిల్లా.

...రెస్పాండెంట్స్

జనరల్ నోటీస్ టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పైన తెలిపిన పిటిషనర్ అయిన కె. నాగరాజు శెట్టి, గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, ఆదోనిలో పైన కనపరచిన రెస్పాండెంట్స్ దివాలా దావా దాఖలు చేసి యున్నారు. కావున ఎవరికైనా ఇందుపైకి ఆక్షేపణలుగాని మరియు అభ్యంతరములుగాని వున్నయెడల తేది:27-06-2025 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును, ఎవ్వరూ హాజరు కాని యెడల పై కోర్టు వారు కేసును పిటీషనర్/దివాలాదారుని పరముగా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : 27-06-2025

ఇట్లు,

శ్రీ ఎస్. అంజనప్ప

పిటీషనర్ తరపు అడ్వోకేట్, ఆదోని-518301.

మొబైల్ నెం.9346814659